





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 244 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 25-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00

## మరో మైలురాయిని అందుకున్న ఇస్రో

- బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది
- ఈ ప్రయోగం ఇస్రోకి చారిత్రాత్మకమైన విజయం
- అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామన్న ఇస్రో చైర్మన్

తిరుపతి,

భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ ఇస్రో మరో మైలురాయిని చేరింది. శ్రీహరి కోటలో బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను ఈ రాకెట్ విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది. కేవలం 15 నిమిషాల్లోనే బ్లూబర్డ్ ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో ఈ ప్రయోగం నిర్వహించింది. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా 4.జి, 5జి సేవలను బ్లూ బార్డ్ బ్లాక్-2 అందించనుంది. ఎల్వీఎం 3 రాకెట్ సిరీస్‌లో ఇది 9వ ప్రయోగం. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ.. బాహుబలి ప్రయోగం విజయవంతమైందన్నారు. ఎల్వీఎంప్రయోగాల్లో సంపూర్ణ విజయాలు సాధిస్తున్నా మని తెలిపారు. అతి తక్కువ సమయంలో రాకెట్ రూపొందించి విజయవంతం చేశామన్నారు. అమెరికన్ కస్టమర్ కోసం ప్రయోగం


-మిగతా 2 లో


# నేనున్నంత కాలం.. నీకు అధికారం కల్లే



రాష్ట్రంలో బీఆర్ఎస్, కేసీఆర్ ఇక గత చరిత్రే

- వరుస ఓటములు ఎదురయిన సిగ్గురాలేదా
- నన్ను..నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినా పట్టించుకోలే
- కేసులు పెట్టి జైలుకు తోసినా లాభం లేదని మిన్నకున్నా
- ఫామ్‌హౌజ్‌నే జైలుగా మార్చుకుని ఉంటున్నావని గుర్తుంచుకో
- నీలా పాస్‌పోర్టు బ్రోకర్ దందా చేసి పైకి రాలేదు
- సొంత చెల్లిని మెడబట్టి గెంటిన కేటీఆర్ నాపై విమర్శలా
- నీలాంటి వారిని చాలామందిని చూసా..గుర్తుంచుకో
- కిందిస్థాయి నుంచి వచ్చి సీఎంగా అయ్యా
- కొడంగల్ సభలో కేసీఆర్‌పై ఘాటు విమర్శలు చేసిన రేవంత్

### కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు

మహబూబ్‌నగర్, -డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శపథం చేశారు. మంతరిగా, కేంద్రమంత్రిగా, సిఎంగా పదేళ్లు పనిచేసిన కెసిఆర్ నాలుగు మంచి మాటలు చెప్పకుండా తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నీలాగా తిట్టుడు మొదలు పెడితే తట్టుకోలేవు కెసిఆర్ అంటూ హెచ్చరికలు చేశారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.


-మిగతా 2 లో







## భారత్‌తో ఘర్షణలు కోరుకోవడం లేదు

- భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకుంటోంది
- దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది
- భారత్‌తో మంచి సంబంధాలు కొనసాగడం రెండు దేశాలకు లాభదాయకమే
- ఆ దేశ ఆర్థిక సలహాదారు డాక్టర్ సలేహుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు


2 లో


## ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత

- శిలాజ ఇంధనాల వాడకం కూడా ఓ కారణం
- నేను మూడ్రోజుల్లోనే ఇన్‌ఫెక్షన్ బారిన పడ్డా
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ,-డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతపై కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు తన శాఖ కూడా ఒక కారణమనే విషయాన్ని అంగీకరిస్తున్నానని అన్నారు. బుధవారంనాడు ఢిల్లీలో మాజీ కేంద్ర సమాచార కమిషనర్ ఉదయ్ మాహూర్‌కర్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, భారతదేశం ఏటా రూ.22 లక్షల కోట్ల విలువైన


-మిగతా 2 లో


## సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారు

- బీఆర్ఎస్ పార్టీ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలంటేనే గడగడ వణుకుతున్నడు
- రేవంత్ రెడ్డి ఊరురా ప్రచారం చేసినా ఫలితం రాలే
- బీఆర్ఎస్ సర్పంచ్‌ల అభినందనలో హరీష్ రావు



మెదక్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలంటేనే గడగడ వణుకుతున్నడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన నర్సపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గెలిచిన వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రేవంత్‌రెడ్డిని ఏకిపారేశారు. 'సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన వారికి నా పక్షాన, బీఆర్ఎస్ పార్టీ పక్షాన హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు. ఈ గెలుపు మామూలు గెలుపు కాదు, అద్భుతమైన గెలుపు. ఓటమి భయంతో రేవంత్‌రెడ్డి కాలికి బలపం


-మిగతా 2 లో


## పంచాయితీలకు వెంటనే నిధులు ఇవ్వాలి

- లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరిక



కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ :గ్రామ పంచాయతీలకు నెలరోజుల్లోగా నిధులు విడుదల చేయాలని.. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. రెండేళ్లుగా రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. పంచాయితీలకు ఇచ్చిన నిధులన్నీ కేంద్రానివే


-మిగతా 2 లో


## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజినరీ నేత

### రాబోయే స్థానిక ఎన్నికల్లోను సత్తా చాటుతాం

- నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్



నిజామాబాద్ డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ రాష్ట్రంలో అత్యధిక కాంగ్రెస్ సర్పంచులు నిజామాబాద్ జిల్లాలోనే గెలుపొందారని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకంగా ఉంటాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క జీవోను కూడా బహిర్గతం చేయలేదన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ


-మిగతా 2 లో


## పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదు

- పీపీపీ విధానం దేశవ్యాప్తంగా అమలువుతోంది
- విమర్శలను సమర్థంగా తిప్పి కొట్టాల్సిందే
- అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ



అమరావతి,డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం.. పీపీపీ విధానంపై ముందుకేనని తేల్చి చెప్పారు. తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. కేంద్రం మార్గదర్శకాల మేరకు వీజీఎఫ్‌కు నిర్ణయం తీసుకున్నామన్నారు. వీజీఎఫ్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 30 శాతం చొప్పున ఆర్థిక మద్దతు ఉంటుందని తెలిపారు. టెండర్ల పక్రియను


-మిగతా 2 లో




## గాజ వాసులను వెంటాడుతున్న మృత్యువు

- వైద్య సరఫరాలను అడ్డుకుంటున్న ఇజ్రాయిల్

గాజా :

ఇప్పటికే అనేక కష్టాలను ఎదుర్కొంటున్న గాజావాసులను కొత్త ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. వైద్య సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్న గాజా వాసుల విషయంలో ఇజ్రాయిల్ మరింత అమానుషంగా వ్యవహరిస్తోంది. వారిని మృత్యుముఖంలోకి నెడుతోంది. గాజాలో ఆరోగ్య వ్యవస్థ ఇప్పటికే కుదేలయింది. తాజాగా ఇజ్రాయిల్ చర్యలతో ఏ క్షణాన అయినా కుప్పకూలిపోయే ప్రమాదం తలెత్తింది. గాజాలోకి వైద్య పరికరాలు, మందులు ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటుండడంతో వేలాది మంది రోగులను మృత్యువు వెంటాడుతోంది. గాజాలోని ఆస్పత్రులలో పరిస్థితి దారుణంగా, భయానకంగా ఉన్నదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్-బర్ష్ తెలిపారు. అత్యవసర వైద్య సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని, ఫలితంగా కీలక కేసులకు వైద్యులు చికిత్స అందించలేకపోతున్నారని చెప్పారు. అయితే, అత్యవసర మందులు, వైద్య పరికరాలను గాజాలోకి ఇజ్రాయిల్ సైన్యం


-మిగతా 2 లో

## మరో మైలురాయిని అందుకున్న ఇస్రో

మొదటి తరువాయి

చేపట్టామని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ ప్రయోగాల్లో ఇది ఒకటన్నారు. 34 దేశాలకు ఇస్రో సేవలందిస్తోందని అన్నారు. గగన్‌యాన్ కోసం ఈ ప్రయోగం మరింత ఆత్మవిశ్వాసం కలిగిస్తోందని తెలిపారు. ఇస్రోపై అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామని ఇస్రో చైర్మన్ తెలిపారు.ఈ ప్రయోగం ఇస్రోకి చారిత్రాత్మకమైన విజయమన్నారు. వాణిజ్య ప్రయోగాలలో మరోసారి సత్తా చాటామని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ ప్రయోగం 52 రోజుల్లోనే సిద్ధం చేసి ప్రయోగం చేపట్టామని చెప్పారు. మన శాస్త్రవేత్తల సమిష్టి విజయం.. ఎల్‌వీఎం 3 - ఎం 6 రాకెట్ ప్రయోగం అని చెప్పుకొచ్చారు. ఈ ప్రయోగ విజయం తమకు అత్యంత ధైర్యాన్ని కల్పించిందన్నారు. ఎల్‌వీఎం ప్రయోగాలలో ఈ ప్రయోగం మూడవ వాణిజ్య ప్రయోగమని వెల్లడించారు. ఎల్‌వీఎం రాకెట్లనే చంద్రయాన్ 4, 5కు ఉపయోగిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మానవ రహిత ప్రయోగాలని చేపట్టబోతున్నామని ప్రకటించారు. వాణిజ్య ప్రయోగ ఒప్పందాలు పూర్తయిన వెంటనే వరస వాణిజ్య ప్రయోగాలని చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో నావిగేషన్ ప్రయోగాలు, అంతరిక్షంలో స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు.

## భారత్‌తో ఘర్షణలు కోరుకోవడం లేదు

- భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకుంటోంది
- దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది
- భారత్‌తో మంచి సంబంధాలు కొనసాగడం రెండు దేశాలకూ లాభదాయకమే
- ఆ దేశ ఆర్థిక సలహాదారు డాక్టర్ సలేహుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు



న్యూఢిల్లీ

మన పొరుగు దేశం బంగ్లాదేశ్ లో భారత్ కు వ్యతిరేకంగా ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనలతో ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతిన్నాయి. దీనిపై ఆ దేశం తాజాగా స్పందించింది. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పొరుగుదేశమైన భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకుంటోందని ఆ దేశ ఆర్థిక సలహాదారు డాక్టర్ సలేహుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు.'ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం భారత్ వంటి పెద్ద పొరుగుదేశంతో ఘర్షణలు కోరుకోవడం లేదు. బదులుగా న్యూఢిల్లీతో స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని కోరుకుంటోంది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఉద్రిక్తతలను తగ్గించి, భారత్‌తో సంబంధాలు పునరుద్ధరించేందుకు ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ వ్యక్తిగతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. భారత్‌తో మంచి సంబంధాలు కొనసాగడం రెండు దేశాలకూ లాభదాయకమే' అని అన్నారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లో ఇటీవలే చెలరేగిన భారత వ్యతిరేక నిరసనలు పూర్తిగా రాజకీయ కారణాలతో జరిగినవేనని అహ్మద్ తెలిపారు. వాటికి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## పంచాయితీలకు వెంటనే నిధులు ఇవ్వాలి

మొదటి తరువాయి

అని స్పష్టం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే.. నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇటీవల తెలంగాణలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక గ్రామ పంచాయతీలను గెలుచుకుంది. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు.. మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదీకాక.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ కసరత్తు చేస్తుంది. వీటిని సంక్రాంతి పండగ వెళ్లిన తర్వాత చేపట్టాలని భావిస్తుంది. ఒకవేళ ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఇది నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజినరీ నేత

మొదటి తరువాయి

అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ. 1.70 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులకు ఒప్పందం కుదరడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో పదేళ్ల విధ్వంసం నుంచి వికాసం దిశగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ నోరు జారి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని మందలించారు. ఆయనలా దిగజారి తాము మాట్లాడమని చెప్పుకొచ్చారు. ప్రజలే కేసీఆర్ అండ్ కోకు బుద్ధి చెబుతారని వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా తాము దుర్వినియోగం చేయట్లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులకు అవసరమైన విద్యుత్తు అందించేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందించాలంటే విద్యుత్తు ఎంతో అవసరమని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫామ్‌హౌస్‌లో కూర్చున్న కేసీఆర్ బయటకు వచ్చి విమర్శిస్తున్నారని ఫైర్ అయ్యారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత నేడు మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తాము సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, బీమా పథకం అమలు చేస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# నేనున్నంత కాలం.. నీకు అధికారం కల్లే

మొదటి తరువాయి

'రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు. గతంలో నన్ను, నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టా. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు.. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులున్నారు. చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా అంటూ ఘాటైన విమర్శలు చేశారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పండబెట్టిన ఘనుడవని విమర్శించారు. స్థిరాస్తి వ్యాపారం దందా చేస్తున్నానని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. ఇదేం పాస్‌పోర్టు బ్రోకర్ వ్యవహారం కాదు. దుబాయ్ పంపుతామని ఎవరినీ మోసం చేయలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. మరో వైపు.. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం పడిపోయిందని కేటీఆర్ చెబుతున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వారు పోతారని వదిలేశాం. మైకు ముందుకు రావట్లేదు.. దాక్కున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. నువ్వెంత.. నీ స్థాయి ఎంత? తండ్రి పేరు చెప్పుకొని బతుకుతున్నావు. ఏపీలో చదువుకున్న కేటీఆర్‌కు తెలంగాణ గురించి ఏం తెలుసు? మా ఊరికొస్తావా? మీ ఊరికి రావాలా? ఎవరు భయపడుతున్నారో తెలుస్తుంది. గజ్వేల్‌లో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన చేపడితో పాతాళానికి వెళ్లారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే.. 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. ఒకవేళ 153 సీట్లయితే.. 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాసిపెట్టుకోండి.. ఇదే నా సవాల్. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డపై నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారమనేది కల. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాం. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చాం. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినం. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నాం. ఇన్ని సార్లు ఓడించినా.. ఇంకా నాదే పైచేయి అంటారా? 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి. ఇప్పటికైనా కేసీఆర్ వయసును గౌరవిస్తాం. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. మీరు చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి.. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు. నిజమైన చర్చ అసెంబ్లీలో చేద్దాం.. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు వింటారని కేసీఆర్ , ఆయన కుటుంబంపై నిప్పులు చెరిగారు. అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడిన సీఎం, తనను , తన కుటుంబాన్ని గతంలో కేసీఆర్ వేధించారని, జైల్లో పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన చేసిన పాపాలే ఆయనను వెంటాడుతున్నాయి. జైల్లో పెట్టి ప్రభుత్వ ఖర్చుతో ఆయనకు తిండి పెట్టడం ఎందుకని నేను ఒక్క కేసు కూడా పెట్టకుండా వదిలేశాను. కానీ ఇప్పుడు సోయి లేకుండా మాట్లాడుతూ తోలు తీస్తా అని స్థాయి లేని మాటలు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలకు ప్రతిసవాల్ విసురుతూ, 'రా.. నీ చింతమడకకు రమ్మంటావా లేక కొడంగల్ వస్తావా? ఎక్కడైనా తేల్చుకుందాం. మటన్ కొట్టు మస్తాన్ దగ్గర పొట్టేలును కోసిన తర్వాత తోలు తీసే పని కేసీఆర్‌కు ఇమ్మని చెప్పాను. సాయంత్రం వెళ్లేటప్పుడు దావత్ కోసం ముక్కో బొక్కో ఇచ్చి పంపమని సూచించాను. నన్ను గెలికితే నేను మాట్లాడటం మొదలుపెడితే నువ్వు ఉరి వేసుకుని చస్తావు. మల్లన్న సాగర్‌లో పడి చావాల్సిందే అని అన్నారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే భయంతో సొంత బిడ్డను, అల్లుడిని వెళ్లగొట్టాడని, సొంత చెల్లెలిని పండుగకు కూడా ఇంటికి పిలవలేని వ్యక్తి తన గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. 'పిడకల మూతి బోడిలింగం లాంటి కేటీఆర్, నువ్వు, నీ జాతి అంతా వచ్చినా నేను భయపడను. మీ రాజకీయం ఏంటో చూపిస్తా, రాసి పెట్టుకో' అని సవాల్ విసిరారు. సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి , ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత

మొదటి తరువాయి

శిలాజ ఇంధానాలను దిగుమతి చేసుకుంటోందని, ఇది కాలుష్యానికి ఒక కీలక కారణమవు తోందని అన్నారు. 'నేను ఇక్కడ రెండ్రోజులుగా ఉంటున్నాను. దీంతో ఇన్‌ఫెక్షన్ బారినపడ్డాను. ఢిల్లీ తీవ్ర కాలుష్యం గుప్పిట్లో ఉంది. నేను రవాణా శాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. పెద్దఎత్తున శిలాజ ఇంధనం వాడకమే ఇందుకు కారణమవుతోంది. మనం ప్రత్యామ్నాయ పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ వాటిని అందిపుచ్చుకునేందుకు ప్రజలు వెనకాడుతున్నారు' అని గడ్కరి అన్నారు. బయో ఇంధనాల వాడకం ద్వారా స్వయం సమృద్ధి భారత్ దిశగా మనం ముందుకు వెళ్లలేమా అని గడ్కరి ప్రశ్నించారు. తాను 100 శాతం ఇథనాల్‌తో కారును వాడుతున్నానని, ఇది 60 శాతం ఎలక్ట్రిసిటీని జనరేట్ చేస్తోందని, పొల్యూషన్ అనేదే లేదని చెప్పారు. గతంలోనూ నితిన్ గడ్కరి ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతుండటంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఎప్పుడు వచ్చినా రెండు మూడు రోజులే




ఉంటానని, ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని అనుకుంటానని చెప్పారు. నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను. ఈ కాలుష్యం వల్ల నాకు అలర్జీ వచ్చింది. నేను రవాణా శాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉంది. శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం మాత్రం పెరిగిపోతోంది. మనం వాటి వాడకాన్ని తగ్గించలేమా..? కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ప్రోత్సాహం లభించాలని గడ్కరీ వ్యాఖ్యలు చేశారు. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఏటా దాదాపు రూ. 22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది.కేంద్ర మంత్రి ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా తయారుచేసిన తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారును ఇప్పటికే నితిన్ గడ్కరీ ఆవిష్కరించారు. పెట్రోల్, ఇథనాల్‌ను కలిపి వినియోగించడాన్నే ఫ్లెక్స్‌ఫ్యూయల్ అని పిలుస్తారు. ఇది కాలుష్యాన్ని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఢిల్లీ లో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతోంది. మంగళవారం అతి తీవ్రస్థాయికి దిగజారింది. బుధవారం ఉదయం కాస్త మెరుగుపడింది. ఇదిలాఉంటే.. గతంలోనూ ఆయన దిల్లీ కాలుష్యం గురించి మాట్లాడారు. 'నేను రెండు లేదా మూడు రోజులు మాత్రమే దిల్లీలో ఉంటాను. ఇక్కడికి వచ్చినప్పుడు ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని ఆలోచిస్తుంటా. నేను ముందే రిటర్న్ టికెట్లను బుక్ చేసుకుంటా' అని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.


# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారు

మొదటి తరువాయి

కట్టుకుని తిరిగినా ఫలితం దక్కలేదు. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేయరు. కానీ ఓడిపోతామనే భయంతో రేవంత్‌రెడ్డి ఊరూరు తిరిగిండు. 'అందిరికీ బతుకమ్మ చీరలు ఇచ్చిన, ఆ చీరలు కట్టుకుని వచ్చి కాంగ్రెపోళ్లకు ఓటేయాలె' చిల్లర మాటలు మాట్లాడిండు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ భంగపడింది. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి 90 శాతం, వీలైతే 100 శాతం విజయాలు దక్కాలి. కానీ కాంగ్రెస్‌కు 64 శాతం ఫలితాలే వచ్చాయి. కాంగ్రెస్ 6 వేల సర్పంచ్ పదవులు గెలిస్తే, బీఆర్ఎస్ 4 వేల సర్పంచ్ పదవులు గెలుచుకుంది' అన్నారు. 'బీఆర్ఎస్ హయాంల 32 జిల్లాపరిషత్‌లు మనమే గెలిచినం. 10 డీసీసీబీలు, 10 డీసీఎంఎస్‌లు ఉంటే వంద శాతం మనమే గెలిచినం. సర్పంచ్ ఎన్నికల్లో 80 నుంచి 90 శాతం మనమే గెలిచినం. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా 35 నుంచి 40 శాతం బీఆర్ఎస్ సర్పంచ్‌లను గెలిపించింద్రు ప్రజలు. కాంగ్రెసోళ్లు పైసలు పంచి, సారా పంచి, గూండాగిరి చేసినా గూడా బీఆర్ఎస్ పార్టీ నుంచి 4 వేల మంది సర్పంచ్‌లుగా గెలువడం మామూలు విషయం కాదు. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ లేదు సచ్చిపోయింది అంటడు. కానీ నిద్రల గూడా బీఆర్ఎస్ పార్టీ గురించే కలువరిస్తడు. బీఆర్ఎస్ పార్టీ పేరు తీయకుండా, కేసీఆర్ పేరు తీయకుండా ఎప్పుడన్న మాట్లడుతడా రేవంత్‌రెడ్డి..? మల్ల మీదికెల్లి మేకపోతు గాంభీర్యం. ఓసారి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇగ బీఆర్ఎస్ పని అయిపోయింది. ఇక నుంచి ఆ పార్టీ విత్తనం కూడా మొలకెత్తనియ్యను అని శపథం చేసిండు. కానీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి గుండెల నుంచి 4 వేల మంది బీఆర్ఎస్ సర్పంచులు మొలకెత్తింద్రు' అని వ్యాఖ్యానించారు. 'నీకు దమ్ముంటే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టు. కారు గుర్తులేని సర్పంచ్ ఎన్నికలల్లనే 4 వేల మంది గెలిచింద్రు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెడితే అండ్ల కారు గుర్తు ఉంటది. కారు గుర్తు అంటే కేసీఆర్ గుర్తు. జనం కారు గుర్తు మీద ఓట్లు గుద్దిగుద్ది సంపుతరు నిన్ను ఏమనుకుంటున్నవో. కారు గుర్తు ఉండే ఎన్నికలు పెట్టాలంటే కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుంది. ఎన్నికలంటేనే రేవంత్‌రెడ్డి గడగడ వణుకుతున్నడు' అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

## గాజ వాసులను వెంటాడుతున్న మృత్యువు

మొదటి తరువాయి



అనుమతించకపోవడంతో రోగుల ప్రాణాలు కాపాడేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయని గాజా వైద్యులు చాలా కాలంగా చెబుతూనే ఉన్నారు. అక్టోబరులో కాల్పుల విరమణ అమలులోకి వచ్చినప్పటికీ హమాస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోంది. వైద్య సహాయక వాహనాలను గాజాలోకి ప్రవేశించనివ్వడం లేదు. దీంతో మందులు, వైద్య సరఫరాల కొరత తీవ్రంగా ఉన్నదని, ముఖ్యంగా శస్త్రచికిత్సలు చేసేందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు కరెంటు కష్టాలు, జనరేటర్ల కొరత వెంటాడుతోందని వారు తెలిపారు.

## పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదు

మొదటి తరువాయి

వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కాలేజీల వ్యవహారం కూటమి సర్కార్, వైసీపీ మధ్య తీవ్రమైన యుద్ధానికే తెరలేపింది.. పీపీపీ మోడ్‌ను వ్యతిరేకిస్తూ వైసీపీ పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించి.. చివరకు కోటికి పైగా సంతకాలను గవర్నర్‌కు అందజేసిన విషయం విదితమే కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మించనున్న మెడికల్ కాలేజీల టెండర్ల ప్రక్రియపై సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వైద్య విద్య, వైద్య మౌలిక సదుపాయాల కల్పన విషయంలో వెనక్కి తగ్గేదే లేదని ఆయన స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. టెండర్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు, బిడ్డర్స్ తో నేరుగా సంప్రదింపులు జరపాలన్న సూచన కూడా చేశారు. ఆదోని మెడికల్ కాలేజీ విషయంలో ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందం ఖరారు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. కాలేజీ నిర్మాణం త్వరగా ప్రారంభమయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పీపీపీ విధానం విజయవంతంగా అమలులో ఉందని గుర్తుచేసిన చంద్రబాబు.. ఏపీలో కూడా మెడికల్ కాలేజీలను అదే విధానంలో నిర్మించి, ప్రజలకు భారంలేకుండా మెరుగైన వైద్య విద్య అందిస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధిలో కీలకం. ఇందులో రాజీ లేదు. ఆలస్యం లేకుండా ముందుకు వెళ్లాలి అని తేల్చి చెప్పారు సీఎం చంద్రబాబు నాయుడు..

# గోపా స్వర్ణోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని పిలుపు




**పెద్దపల్లి, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గౌడ అధికారులు మరియు వృత్తి నిపుణుల సంఘం (గోపా) స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 26న హైదరాబాద్‌లో జరగనున్న స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలకు అనుగుణంగా గౌడ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడమే గోపా ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ఐదు దశాబ్దాలుగా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తూ, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, హైదరాబాద్ వంటి నగరాల్లో ఉచిత హాస్టల్ వసతి కల్పించడం ద్వారా ఉన్నత విద్యకు అండగా నిలుస్తోందని చెప్పారు. పెద్దపల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో కులబంధువులు, విద్యావంతులు, వృత్తి నిపుణులు హైదరాబాద్‌లో జరిగే సభకు హాజరై స్వర్ణోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో గోపా ప్రధాన కార్యదర్శి బందారపు యాదగిరి, కోశాధికారి దేవేందర్, గౌరవ సలహాదారులు బుర్ర జగదీశ్వర్, ఉపాధ్యక్షులు బాలసాని స్వామి, వీరగోని శ్రీనివాస్, అడ్డగుంట రాజేందర్, మాచిడి మహేందర్, పర్కల దేవేందర్, మెంటపోతుల రాజయ్య, బొంగోని సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



**పెద్దపల్లి, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే ఆగాస్ 2025 కార్యక్రమం కళాశాల సెమినార్ హాల్లో జరిగింది. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్ జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో పయనిస్తే విజయాలు వారిని వెతుక్కుంటూ వస్తాయని, రానున్న రోజుల్లో మెగా ఉద్యోగ మేళా నిర్వహించి ప్రతి విద్యార్థి ఉద్యోగిగా మారేలా దోహదపడతామని తెలిపారు. ఎంబీఏ విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్‌లు, ఇండస్ట్రియల్ విజిట్‌లు, గ్రూప్ డిస్కషన్‌లు, సెమినార్లు నిర్వహించి సాంకేతిక అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కళాశాలకు ఎన్ఏఏసీ బీంం గ్రేడ్ లభించిందని, యూజీసీ ఐదు సంవత్సరాల పాటు అటానమస్ స్టేటస్ మంజూరు చేసిందని పేర్కొన్నారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి.

# టిఆర్ఎస్‌డి రాష్ట్ర సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపు



**పెద్దపల్లి, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జనవరి మొదటి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు డా. వాసంపల్లి ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదునూరి నర్సింగ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన, పార్టీ విధి విధానాలు నచ్చి జిల్లాలో పెద్ద ఎత్తున నాయకులు, కుల సంఘాలు, మహిళలు, యువకులు పార్టీలో చేరడం గర్వకారణమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ నాయకత్వంలో రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, తీ మహిళలకు అధికంగా సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలపై టిఆర్ఎస్‌డి పార్టీ పోరాడటానికి సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈదునూరి నర్సింగ్, నాయకులు గొట్టే రామరాజు, చిలుముల సంతోష్ కుమార్, సంపత్, శివ, మహిళా నాయకురాలు పుల్లూరి విజయ తదితరులు పాల్గొన్నారు


# గాయత్రి విద్యానికేతన్‌లో క్రిస్మస్ సంబరాలు




**పెద్దపల్లి, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

గాయత్రి విద్యానికేతన్‌లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ముందస్తుగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని సోమిని విద్యార్థులకు క్రిస్మస్ పండుగ ప్రత్యేకతను వివరించారు. పిల్లలు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. యేసు ప్రభువు జననం, ఆయన బాల్యం, క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులు అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్ ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం



**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆధునీకరించిన టూ టౌన్ పోలీస్ స్టేషన్ భవనాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొత్తగా ఏర్పాటు చేసిన విభాగాలను ఆయన పరిశీలించారు. గతంలో ఈ భవనంలో ఉన్న సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను రూరల్ ఏసీపీ కార్యాలయానికి మార్చడంతో మొత్తం భవనాన్ని టూ టౌన్ పోలీస్ స్టేషన్ అవసరాలకు కేటాయించారు. సిబ్బంది పెరగడంతో, ముఖ్యంగా మహిళా పోలీసుల కోసం ప్రత్యేక విశ్రాంతి గది, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మెరుగైన పని వాతావరణం కల్పించడం వల్ల అధికారులు మరింత ఉత్సాహంగా ప్రజలకు చేరువగా సేవలందించగలరని, ఆధునిక హంగులతో సిద్ధమైన ఈ స్టేషన్ ద్వారా సమస్యలను త్వరగా పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రజక సంఘానికి కాంగ్రెస్ నేత యుగేందర్ క్షమాపణ



**గోదావరిఖని, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: రామగుండం నియోజకవర్గంలో కూల్చివేతలపై ప్రతిపక్ష నాయకులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవడంతో కాంగ్రెస్ నేత యుగేందర్ రజక సంఘానికి క్షమాపణలు తెలిపారు. రజక కులస్తులను కించపరిచేలా వచ్చిన మాటలపై సంఘాలు తీవ్రంగా స్పందించి, క్షమాపణ చెప్పకుంటే కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు చాకిరేవు పెడతామని హెచ్చరించాయి. దీనిపై యుగేందర్ స్పందిస్తూ, రాజకులను ఉద్దేశించి కావాలని అనలేదని, రాజకులంటే తనకు గౌరవమని, ప్రతిపక్ష నాయకులను విమర్శించే సమయంలో అనుకోకుండా ఆ పదం వచ్చిందని స్పష్టం చేశారు. ఎట్టకేలకు ఆయన క్షమాపణలు చెప్పడంతో వివాదం సర్దుమణిగింది.

# పెద్దపల్లిలో క్రిస్మస్ విందు కార్యక్రమం



**పెద్దపల్లి, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రైస్తవ సోదర సోదరీమణుల విందు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు హాజరై కేక్ కట్ చేసి ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ మత పెద్దలు ఎమ్మెల్యే విజయరమణకు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రార్ధనలు చేసి ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, సోదరభావం విలువలను బోధిస్తుందని, మత సామరస్యం, ఐక్యతతో సమాజం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పండుగను అందరూ కలిసి జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఒకే రోజు జరుపుకునే పండుగ క్రిస్మస్ అని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్లు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, చర్చ్ నిర్వాహకులు, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# శబరిమలలో మెగాస్టార్ సినిమా విజయానికి ప్రత్యేక పూజలు



**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మెగా అభిమానిగా పేరుగాంచిన సామాజిక సేవకుడు, బ్లడ్ డోనర్ గాలిపెల్లి కుమార్ మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన కొత్త చిత్రం మన శంకర వరప్రసాద్ భారీ విజయాన్ని సాధించాలని శబరిమల అయ్యప్ప సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి భవిష్యత్తులో మరెన్నో ఉత్తమ చిత్రాలు రూపొందించాలని ప్రార్థించారు. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రాబోయే సినిమాలు కూడా విజయవంతం కావాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత ఆధ్వర్యంలో గాలిపెల్లి కుమార్ నిర్వహించారు.

# పాలకుర్తి గ్రామంలో వార్డు మెంబర్ల కుటుంబం



**పాలకుర్తి, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన జూపాక సరోజ కుటుంబం ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు పొందింది. తల్లి సరోజ గతంలో వార్డు మెంబర్‌గా పోటీ చేసి అత్యధిక మెజారిటీతో విజయం సాధించి తన పదవీకాలంలో అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలు పొందింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆమె కుమారుడు జూపాక వెంకటేష్ 2వ వార్డు నుండి, చిన్న కూతురు సంతపూరి సంధ్య 11వ వార్డు నుండి పోటీ చేసి విజయం సాధించారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన, అందరితో కలిసిపోయే స్వభావం ఈ కుటుంబ విజయానికి మూల కారణమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. తల్లి సరోజ మాట్లాడుతూ, వార్డు ప్రజలకు సేవ చేసే సమయంలో పిల్లలు తనను అనుసరించేవారని, అదే అలవాటు వారిని ప్రజాసేవలోకి నడిపిందని తెలిపారు. తండ్రి రాయలింగం ప్రస్తుతం గ్రామ మాల సంఘం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. గ్రామస్తులు ఇంతగా ఆదరించి ఆశీర్వదిస్తున్నందుకు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## పెరిక కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా చుంచు ఆంజనేయులు



**పెద్దపల్లి, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: పెద్దపల్లి పట్టణంలోని పెరిక (పురగిరి క్షత్రియ) కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు బుధవారం నిర్వహించగా, చుంచు ఆంజనేయులు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కర్రె రాజేశం, ముత్తినేని మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా చుంచు కనకయ్య, కోశాధికారిగా కర్రె ప్రవీణ్, సంయుక్త కార్యదర్శిగా నరెడ్ల రమేష్, మీడియా కార్యదర్శిగా దొమ్మటి రాజేష్ బాధ్యతలు చేపట్టారు.కార్యవర్గ సభ్యులుగా కర్రె రాజు, చుంచు సురేష్, కొట్టె సత్యం, వక్కల రాజు, ఎంబడి గట్టయ్య, దొమ్మటి రాజేందర్, దొమ్మటి మల్లయ్య, కొట్టె లక్ష్మీ రాజం ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కొట్టె సదానందం, చుంచు మల్లయ్య, కర్రె చంద్రయ్య, గౌరవ సలహాదారుగా కారుకూరి సుధాకర్ నియమితులయ్యారు.ఎన్నికల ప్రక్రియను లగిశెట్టి చంద్రమౌళి, మంద సాయి ప్రణీత్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేస్తూ కుల మిత్రుల సంక్షేమం, ఐక్యత కోసం సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు.

## ఉచిత నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభం



**హుస్నాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా గొర్రెలకు నట్టల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.తోటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాల భవనం స్థలంలో కొత్త భవనాన్ని నిర్మిస్తామని, వివో భవనాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, సర్పంచ్ బంక లక్ష్మీ, వెటర్నరీ డాక్టర్లు రమేష్, వెంకట్ రెడ్డి, సుకన్యతో పాటు పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లక్షలాది గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చాలా సంవత్సరాలుగా నిలిచిపోయిన ఈ కార్యక్రమాన్ని ప్రజా పాలన ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని చెప్పారు. గొర్రెలు, మేకల కాపరులు తమ దగ్గరున్న వెటర్నరీ డాక్టర్లను సంప్రదించి నట్టల మందు ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మందు వల్ల పురుగులు చనిపోయి వాటి ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు. గ్రామ గ్రామాన వెటర్నరీ డాక్టర్లు వెళ్లి మందు వేయాలని సూచించారు.

## కింగ్ స్టన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఫ్రెషర్స్ పార్టీ




**సిద్ధిపేట, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పొన్నాల గ్రామంలోని కింగ్ స్టన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ (బి.ఇడ్, డి.ఇడ్)లో ఫ్రెషర్స్ పార్టీ సంబరాలు ఘనంగా జరిగాయి. కొత్తగా చేరిన విద్యార్థులను సీనియర్లు ఆత్మీయంగా స్వాగతించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనంత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలను అలవరుచుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల మధ్య స్నేహబంధాలను బలపరుస్తాయని పేర్కొన్నారు.అధ్యాపకులు మాట్లాడుతూ ఫ్రెషర్స్ పార్టీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, కళాశాల వాతావరణానికి త్వరగా అలవాటు పడేందుకు దోహదపడుతుందని తెలిపారు.సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు అందరిని అలరించాయి. సీనియర్, జూనియర్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. ఈ ఫ్రెషర్స్ పార్టీ విద్యార్థులకు మధుర జ్ఞాపకంగా నిలిచింది.

# ఇందిరానగర్ మాజీ సర్పంచ్ కడారి ప్రసాద్ బీజేపీలో చేరిక



**హుస్నాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కడారి ప్రసాద్ బీజేపీలో చేరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోమ్ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ ఆయనకు పార్టీ కండువా కప్పి అధికారికంగా ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా కడారి ప్రసాద్ మాట్లాడుతూ దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రగతి లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు తనను ఆకర్షించాయని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలకు జవాబుదారీ పాలన అందిస్తున్న బీజేపీ విధానాలు తనను ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. ఇందిరానగర్ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ అడుగుజాడల్లో నడుస్తానని హామీ ఇచ్చారు. బండి సంజయ్ మాట్లాడుతూ కడారి ప్రసాద్ లాంటి అనుభవజ్ఞులు పార్టీలో చేరడం బీజేపీకి మరింత బలం చేకూరుస్తుందని అన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కృషి కీలకమని పేర్కొన్నారు.మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ఇందిరానగర్ గ్రామంలో బీజేపీకి ప్రజాబలం పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల కలెక్టర్ సందేశం



**మంచిర్యాల, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ నస్పూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలను అలవరుచుకోవాలని సూచించారు. పోషకాహార మెనూ అమలు, శుద్ధమైన త్రాగునీరు, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులను ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. తరువాత జిల్లా కార్యాలయంలో జరిగిన మీ డబ్బుమీ హక్కు కార్యక్రమంలో పాల్గొని బ్యాంకులు, భీమా సంస్థలు, పోస్ట్ ఆఫీసుల్లో క్లెయిమ్ చేయని సొమ్మును తిరిగి పొందే విధానాన్ని వివరించారు. 10 సంవత్సరాలు దాటి వినియోగించని నగదు ఆర్బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఫండ్‌లో జమ అవుతుందని, సంబంధిత బ్యాంకులో కేవైసీ పత్రాలు సమర్పించి తిరిగి పొందవచ్చని తెలిపారు. గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఆర్థిక అక్షరాస్యత పెంపొందించాలని సూచించారు.జిల్లాలో 475 ఖాతాలకు సంబంధించిన రూ.2.88 కోట్లు క్లెయిమ్ సొమ్ము సెటిల్ చేసినట్లు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు యూనిఫారాల పంపిణీ



**హైదరాబాద్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లాలోని ఆశా కార్యకర్తలకు యూనిఫారాల (చీరలు) పంపిణీ కార్యక్రమం బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. లలితా దేవి, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి మన్మధమ్మతో కలిసి ఆశా కార్యకర్తలకు యూనిఫారాలను అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గ్రామీణ ఆరోగ్య సేవల అమలులో ఆశా కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు చేరవేయడంలో ఆశాలు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ఆశా కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌కరీంనగర్ లిమిటెడ్ హాల్ట్ బస్సులు పునరుద్ధరించాలని డిమాండ్



**హుస్నాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నుండి కరీంనగర్‌కు గతంలో నడిచిన లిమిటెడ్ హాల్ట్ బస్సులను కరోనా తర్వాత తీసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.ప్రస్తుతం ఎక్స్ప్రెస్ బస్సులు ఐదు నడుస్తున్నా, ప్రతి స్టేజీలో ఆగకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే 7080 రూపాయల చార్జీలు వసూలు చేయడం వల్ల పేద ప్రయాణికులకు ఆర్థిక భారం పెరుగుతోందని ఆయన అన్నారు. గతంలో లాగా లిమిటెడ్ హాల్ట్ బస్సులను తిరిగి నడిపిస్తే ప్రజలకు సౌకర్యం కలుగుతుందని, పేద ప్రయాణికులకు భారం తగ్గుతుందని వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని వెంటనే లిమిటెడ్ హాల్ట్ బస్సులను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు



**హుస్నాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా మొత్తం రూ.8,12,132 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.హుండీ లెక్కింపును దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకుడు రమణా రెడ్డి పర్యవేక్షించారు. ఆలయ ఈవో పి. కిషన్ రావు, గోమాత సేవా పరిషత్ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ ఆదాయం గ్రామ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత




**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉదయం గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కొత్తపల్లి మండలం ఎలాందల్ గ్రామానికి చెందిన ఎత్తారు సమ్మయ్య అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తుండగా తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ పీస్ హెచ్చరించారు.

# హుస్నాబాద్ అభివృద్ధికి విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యత




**హుస్నాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో పాటు గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. సంక్రాంతి లోపు ప్రతి మండలంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, దీర్ఘకాలిక చికిత్స పొందుతున్న వారి వివరాలు సేకరించి హైదరాబాద్‌లో నాణ్యమైన వైద్యం అందిస్తామని తెలిపారు. త్వరలో కాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో యాసంగి పంటలకు ఎరువుల లభ్యతపై లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని, నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం సందర్భంగా రైతు మేళా జరుగుతుందని, ఒక్కో రైతు వేదిక నుంచి వెయ్యి మంది రైతులను తీసుకురావాలని సూచించారు. హుస్నాబాద్ పశుసంపదలో అగ్రగామిగా నిలవాలని, పాల ఉత్పత్తి పెంచాలని అన్నారు. విద్యుత్ సమస్యలపై జనవరి 15లోపు నివేదిక ఇవ్వాలని, అదనపు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి, భవనాలకు పెయింట్లు వేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాత్రి పూట స్కూల్ ప్రహరీలోకి ప్రవేశించి మద్యం సేవిస్తే రౌడీషీట్ ఓపెన్ చేయాలని పోలీసులకు ఆదేశించారు. ప్రతి స్కూల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.సమీక్షా సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, అధికారులు పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్ కూలిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని అడవి సోమనపల్లి గ్రామంలో చెక్ డ్యామ్ కూలిన ఘటనపై రాష్ట్ర ఐటీ పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుసగా చెక్ డ్యామ్‌లు కూలిపోవడం ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేసిందని, ఈ ఘటనలపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యమా, లేక మానవ తప్పిదమా అన్నది రిపోర్ట్ ఆధారంగా తేలుస్తామని, నాసిరక నిర్మాణం లేదా నాణ్యత లోపం తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కావాలనే ధ్వంసం చేసినట్లు నిర్ధారణ అయితే కఠిన శిక్షలు విధిస్తామని స్పష్టం చేశారు.రైతులకు మేలు చేసే చెక్ డ్యామ్‌లను ధ్వంసం చేస్తే ప్రభుత్వం ఊరుకోదని, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలను సహించబోమని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. విచారణను వేగవంతం చేసి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బిఆర్ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయం ప్రారంభం



**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని హుస్సేనీపురా 32వ డివిజన్‌లో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ సుడా డైరెక్టర్ షేక్ యూసుఫ్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తోనే ప్రజా సంక్షేమం

-ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి

**కడ్తాల్, డిసెంబర్ 24**
**( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**



: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం జరుగుతుందని ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం బాలాజీ నగర్ తండాకు చెందిన బీజేపీ పార్టీ నాయకులు కొర్ర దేవు తో పాటు పలువురు వంశీచంద్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి నరేందర్, చల్లా సురేందర్ రెడ్డి, గణేష్, పర్వతాలు యాదవ్, బలరాం నాయక్, ఉప సర్పంచ్ రమేష్, పాండు, శివానంద్, జైపాల్, రాజు, గణేష్, రమేష్ గౌడ్, కృష్ణ, రమేష్, దాసు, హన్మ, పవన్, దేవ్, కిసాన్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాలు

-ఖమ్మంలో భారీ బహిరంగ సభకు పిలుపు




**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కష్టజీవుల రక్షణ కవచంగా నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా 2026 జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.కరీంనగర్ నగరంలోని కట్టారాంపూర్‌లో సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ, కార్మికులు, రైతులు, పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ వందేళ్లుగా పోరాటాలు నిర్వహించిందని, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఓటు హక్కు, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి అనేక విజయాలు సాధించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా నిజాం పాలనకు ముగింపు పలికిందని పేర్కొన్నారు.జనవరి 4న కరీంనగర్ జిల్లాలో కూడా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖమ్మం సభకు జిల్లా నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, శాఖ కార్యదర్శులు, నగర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## రిటైర్ అయిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని ఎస్‌జిటియు డిమాండ్



**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎస్‌జిటియు రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజయేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు మద్దతుగా వారు మాట్లాడుతూ, రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు బకాయిలు రాక మనోవేదనకు గురవుతున్నారని, సరైన వైద్యం పొందలేక ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ బకాయిల కోసం ఎదురుచూస్తూ ఉద్యోగులు అప్పుల పాలవుతున్నారని, రోగాలు వచ్చినప్పుడు చికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను ఏకకాలంలో చెల్లించాలని, భవిష్యత్తులో రిటైర్మెంట్ సంఘం చేపట్టే పోరాటాలకు ఎస్‌జిటియు మద్దతు ఇస్తుందని వారు స్పష్టం చేశారు.

## ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు కోరిన కాంగ్రెస్ నాయకులు



**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.కరీంనగర్ సి.ఎస్.ఐ ప్రాంగణంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నప్పటికీ విడుదలైన ఫోటోలు, సమాచారంలో ఆయనను విస్మరించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇదే విధంగా ఇటీవల సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో కూడా ఆయన నియోజకవర్గ పరిధిలో జరిగినప్పటికీ అధికారిక సమాచారంలో పొందుపరచలేదని గుర్తు చేశారు.ఒక దళిత ప్రజాప్రతినిధిని పునరావృతంగా విస్మరించడం ప్రజల్లో అయోమయం కలిగిస్తోందని, ఇది ఆత్మగౌరవానికి భంగం కలిగించడమేనని వారు అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి అనిల్, జీడి రమేష్, సముద్రాల లక్ష్మణ్, జుంజుపల్లి వివేక్, గొట్టే బాబు, కనకం విద్యాసాగర్, యూత్ కాంగ్రెస్ నాయకులు మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెల్లి గ్రామ సర్పంచ్ రామిడి రాజిరెడ్డికి అభినందనలు




**గంగాధర, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం తాడిచెల్లి గ్రామానికి నూతన సర్పంచిగా ఎన్నికైన సీనియర్ కాంగ్రెస్ నేత, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రామిడి రాజిరెడ్డిని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రామిడి రాజిరెడ్డి గతంలో ఒకసారి ప్రత్యక్ష ఎన్నిక ద్వారా, మరొకసారి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా గెలిచినట్లు, ఈసారి కొంత విరామం తర్వాత ప్రజాబలంతో మరోసారి విజయం సాధించడం ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనమని నాయకులు కొనియాడారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా-24డిసెంబర్**
) మెదక్ మండలం గుట్టకింద పల్లి గ్రామానికి చెందిన అయితరాబోయిన చంద్రం ఇటీవల ప్రమాదవశాస్తూ విద్యుత్ షాక్ తో మరణించారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి బుధవారం గుట్టకిందపల్లి గ్రామానికి చేరుకొని చంద్రం భార్య భవానిని పరమర్శించి, మనోధైర్యాన్ని తెలిపి భరోసానిచ్చారు.ఈ సందర్భంగా రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.వీరి వెంట మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్,మెదక్ మాజీ ఎంపీపీ కొత్తపల్లి. కిష్టయ్య,నాయకులు రాములు,రవి సుధాకర్,నాగమల్లు, శేఖలు,శంకరయ్య,పెంటయ్య,ఆగం,యాదగిరి తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం నిర్వహించి పీహెచ్‌సీ వారీగా కాన్పులు, ఆరోగ్యశ్రీ, 108 సేవలు, ఇమ్యూనైజేషన్, టీబీ, డెంటల్ ఎగ్జామినేషన్ వంటి అంశాలపై సమీక్షించారు. కనీసం 80 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగాలని, గర్భిణీలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్‌బిఎస్‌కే పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థుల స్క్రీనింగ్ నిర్దేశిత సంఖ్యలో జరగాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గర్భిణి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసి రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని, నాణ్యమైన సేవలతో ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచాలని అన్నారు. ఆసుపత్రుల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచి మందుల కొరత రాకుండా చూడాలని సూచించారు. రాష్ట్రంలోనే మొదటిసారి జిల్లాలో డెంటల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నామని, పాఠశాలలు, పంచాయితీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అంబులెన్సులు డ్రైవర్లు లేక ఖాళీగా ఉండకూడదని, అవసరమైన చోట సిబ్బంది సర్దుబాటు చేయాలని ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ పోర్టల్‌లో రోగుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే మందుల కోసం ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని కలెక్టర్ పేర్కొని సిబ్బందిని అభినందించారు. అనంతరం క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో వెంకటరమణ, అదనపు డిఎంహెచ్వో సుధా, డిప్యూటీ డిఎంహెచ్వోలు చందు నాయక్, రాజగోపాల్, ఇమ్యూనైజేషన్ అధికారి సాజిదా, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, జిజిహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా క్రిస్మస్ సంబరాలు





**ఆమనగల్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని లిటిల్ స్కాలర్ టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ చుక్క అల్లాజిగౌడ్, డైరెక్టర్ చుక్క సావిత్రి గౌడ్ ప్రసంగిస్తూ శాంతి స్వరూపానికి ప్రతీక ఏసుప్రభువు అని కొనియాడారు. ఆయన బెత్లెహేము పురంలోని పశువులపాకలో జన్మించి ఈ లోకానికి పాపం నుంచి రక్షించడానికి వచ్చారని వివరించారు. చిన్నారులు వేషధారణలతో ఆకట్టుకుని వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రిస్మస్ కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు సందడి చేస్తూ ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించాయి. స్కూల్ యజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకను మరింత వైభవవంతం చేశారు.

# ప్రకాశం పంతులు నగర్లో సైన్స్ ఫెయిర్ సందడి



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: ప్రియదర్శిని మోడల్ హై స్కూల్ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు నగర్లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. తమ ప్రతిభను ప్రదర్శించిన చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వీరే దేశ భవిష్యత్తుకు నాంది అని కొనియాడారు. సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు సృజనాత్మక ఆవిష్కరణలతో ఆకట్టుకున్నారు. శాస్త్రీయ ఆలోచనలను ప్రతిబింబించే మోడల్స్, ప్రయోగాలు సందర్శకులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్ సమీర్, అధ్యాపకులు, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, నారాయణ, షాకీర్, మల్లం శ్రీనివాస్, తోకల శ్రీనివాస్ తదితరులు పాల్గొని వేడుకను మరింత వైభవవంతం చేశారు.

# కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఎంప్లాయిస్ నిరాహార దీక్ష.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని డిమాండ్.



**నల్లగొండ ,డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పదవి విరమణ పొంది 21 నెలలు గడిచిన తమకు ఇంతవరకు ప్రభుత్వం నుండి బకాయిలు చెల్లించలేదని దీంతో అనేకమంది అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వెంటనే బకాయిలు చెల్లించాలని, రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి బిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరాహార దీక్షలో ఆయన మాట్లాడుతూ 2024 మార్చి తదుపరి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన పెన్షన్ బకాయిలు ఏక మొత్తంగా, వెంటనే చెల్లించాలని ఈ రోజు నిరాహార దీక్ష ద్వారా ప్రభుత్వం ను డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ దీక్షా శిబిరంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు దీక్షకు సంఘీభావంగా పాల్గొన్నారు. నేటి నిరాహార దీక్షలో రామకృష్ణారెడ్డి, ముజాహిద్ అలీ ఖాన్, గణేష్, శంకరయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, బిక్షం,లక్ష్మారెడ్డి, భాస్కర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి, శ్యాంసుందర్,నారాయణరెడ్డి, భాస్కర్,ఏడుకొండలు, బాలయ్య, రాధాకృష్ణ,సుజాత, నాగమణి,సుధారాణి,శ్రీనివాస్ రాములు, మంగమ్మ,కిషన్ రావు,నరేందర్ లింగయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొని నిరాహార దీక్షను విజయవంతం చేసినారు.

# హోమ్ లోన్ మాఫీ కోసం భర్త హత్య

## - ముగ్గురు అరెస్ట్



**కేసముద్రం, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో సంచలనాత్మక ఘటన వెలుగులోకి వచ్చింది. పరికిబండ గ్రామానికి చెందిన భూక్య ఈరన్న (45)ను అతని భార్య, ఆమె ప్రియుడు, మరో వ్యక్తి కలిసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కుటుంబ ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఈరన్న తన భూమిని అమ్మి అప్పులు తీర్చుకున్నప్పటికీ, ఇంకా లోన్లు మిగిలి ఉండటంతో భార్య భూక్య విజయ, ఆమె ప్రియుడు బోడ బాలోజీ, అతని వద్ద కిరాయికి ఉంటున్న ఆర్.ఎం.పి వైద్యుడు ధర్మారపు భరత్ కలిసి హోమ్ లోన్ మాఫీ కోసం ఈరన్నను హత్య చేయాలని పన్నాగం పన్నారు. డిసెంబర్ 22వ తేదీ రాత్రి తూము పామాయిల్ తోట వద్ద మద్యం సేవిద్దామని పిలిచి, ముందుగానే వేసుకున్న ప్లాన్ ప్రకారం బోడ బాలోజీ ఇనుప రాడ్డుతో ఈరన్న తలపై బలంగా కొట్టగా, ధర్మారపు భరత్ టవల్‌తో ముక్కు, నోరు మూసి చంపారు. అనంతరం రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని మోటార్ సైకిల్‌తో పాటు పొలంలో పడవేశారు. 24 గంటల్లోనే కేసును చేదించిన కేసముద్రం సీఐ వై. సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతి కిరణ్, పి. నరేష్ మరియు వారి బృందాన్ని జిల్లా ఏఎస్పీ డా. పీ. శబరీష్ అభినందించారు.

# బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవరకొండ దీపక్



**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవరకొండ దీపక్‌ను నియమించినట్లు సంఘం అధ్యక్షుడు మాదాసు సంజీవ్ ప్రకటించారు. బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ పునరుద్ధరించి బీసీలకు రుణాలు మంజూరు చేయాలని, రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో యువకులను గెలిపించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకరించిన బీసీ సంఘాల నాయకులు వంగల రవి గోపాల్, దుంపట మురళీ, మంద వెంకన్న, సాయితేజ, శివ తదితరులకు దేవరకొండ దీపక్ కృతజ్ఞతలు తెలిపారు.

# అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ



**ఎల్బీనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్బీనగర్ చౌరస్తాలో రేపు భారత రత్న అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ రూరల్ ప్రబారి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్, నాగోల్ డివిజన్ బీజేపీ నాయకుడు చింతల సురేందర్ యాదవ్, కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శి వగ్గుల సుందర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్కపల్లి గ్రామంలో జనవరి 4న మెగా మెడికల్ క్యాంప్



**మాడుగుల, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఆర్కపల్లి గ్రామ కేంద్రంగా జనవరి 4, 2026న మెగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించనున్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో విస్తృత వైద్య సేవలు అందించనున్నారు. క్యాంప్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు కంటి, పంటి, బీపీ, షుగర్ వంటి సాధారణ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు. ముఖ్యంగా క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలతో పాటు సమీప ప్రాంతాలవారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్య పరిరక్షణ సేవలను పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మెగా మెడికల్ క్యాంప్‌ను పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చైర్మన్ నరేష్ దండు నిర్వహిస్తున్నారు. ముందస్తు సమాచారం కోసం 819090101 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

# రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పి డి ఎస్ యు పిలుపు



**వెల్దండ, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ విద్యార్థి సంఘం సైంటిఫిక్ ఎడ్యుకేషన్, సమసమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్, సంక్షేమ హాస్టల్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. 2026 జనవరి 5, 6, 7 తేదీలలో వరంగల్ జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి డి ఎస్ యు వెల్దండ అధ్యక్షుడు ఆంజనేయులు, విద్యార్థి నాయకులు వంశీ, విశాంత్, కళాశాల విద్యార్థులు పల్లవి, భార్గవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ అలీ-పదవీ విరమణ

యెంత గొప్పని మనసు నీదో
యెంత తీయని గుణము నీదో
మా మహమ్మద్ అలీ సారూ..!

కొవ్వొత్తిలా నీవు కరిగి పోతుంటావు
విద్యార్థి భవితల్లో వెలిగి పోతుంటావు

చందమామలోని చల్లదనము నీవు
చిన్న పెద్దా లేదు పలకరిస్తుంటావు

తక్కళ్ళపల్లి జన్మస్థలము మీది
నివాస స్థలము చింతపట్ల యందు
యాచార మం//రంగారెడ్డి జిల్లా

జన్మనిచ్చిన తల్లి సకీనాబీ అయితే
నడక నేర్పన తండ్రి సాహెబ్ అలీ

తోడబుట్టినవారు ఎనమడుగురైతే
పేద ఇంటికి నీవు పెద్ద కొడకైనావు

చదువుసంధ్యా లేక కుటుంబ భారం
అమ్మమ్మ గారిల్లు చేరదీసెను నిన్ను
పదివరకు చదివించి దీవించె నిన్ను

కష్టాల కడలిలో పెరిగి పోయినావు
పై చదువు కోసం పట్నమెళ్ళినావు

కొలువొచ్చినంకా ఎదిగిపోయినావు
అర్థాంగి శ్రీమతి రెహానా పర్వీన్....
పుణ్య దంపతులై పేరుపొందినారు

పుత్రరత్నాలు నలుగురు ఉన్నారు
ఇరువురు కతర్లో జీవిస్తువున్నారు
మురిపాల కూతురులు ముగ్వురు
బహు చక్కంగ బ్రతుకుతు ఉన్నరు

శాదస్తమెరుగని శాంతి స్వరూపుడు
గణిత శాస్త్రంలోన మేలైన గురుడు

సాంకేతిక విద్య అలవర్చుకున్నావు
జీవోలపై నీవు పట్టు సాధించావు

పడిపోయె బడులను కాపాడినావు
ఎచ్చెమ్ముగా నీవు పేరుపొందినావు
స్నేహానికి నిన్ను మారుపేరంటారు
సరదాగా టీచర్లు సాగిపోతుంటారు

కులమతాలు నీకడ్డు రావంటావు
మానవత్వంతో సాగిపోతుంటావు

ఆడంబరము లేని నీరాడంబరుడు
అహమంటు లేని అజాత శత్రువు

అంపల్లి మొదలు నీది ప్రస్థానము
నాలుగూర్లు నీవు తిరిగొచ్చినావు

యాచార మండలం కొత్తపల్లిలోన
ఉద్యోగం నీవు విరమించుకున్నావు
ముప్పదేండ్లు నీవు కొలువు జేసినావు

ప్రయాణముల్లో వస్తుపోతుంటే
ఆరోగ్యమెంతో క్షీణించినా గానీ
విధిని మరువని గురువర్యా.....!
మీ పాదాలకు మా వందనాలు..!!

డా"జోగు కృష్ణయ్య
రంగారెడ్డి జిల్లా



# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



**మనోహరాబాద్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**




మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని పరికిబండ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు మంచ భానుప్రియ శ్రీరామ్ తమ అనుచరులతో కలిసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.
ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోతారం, గౌతోజిగూడ గ్రామాల సర్పంచులు, నాయకులు పురం రవి, నర్సింలు, చింతల ఆనంద్, పిట్ల శేఖర్, కృష్ణ, గోసు సత్యనారాయణ, మంచ నర్సింలు, అర్జున్, కొల్తూరు రాజు, నవీన్ గౌడ్, గాంతి ఆంజనేయులు, అశోక్, తీగుల్ల శ్రీనివాస్, ఏ రమేష్, మడుగు ఆంజనేయులు, షారుక్, జి రమేష్, కిరణ్, దప్పు లక్ష్మణ్, శ్రీశైలం, చిన్న బిక్షపతి, రమేష్, కుమార్, ఆంజనేయులు, మంచి రమేష్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రాథమిక సమస్యలు ఉన్నప్పుడే పరిష్కరించుకోవాలి



**వనపర్తి, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వనపర్తి జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్ హై స్కూల్లో మిత్ర ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడింది. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు కంటి చూపు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సూచనలు అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌతమ్ కుమార్ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంలో కళ్లది అత్యంత ముఖ్యమైన పాత్ర అని, కళ్ళు ఆరోగ్యంగా ఉంటేనే చదువు, పని, జీవన నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి చికిత్స తీసుకుంటే భవిష్యత్తులో పెద్ద సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ మిత్ర ఐ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, వైద్య బృంద సభ్యులు పాల్గొన్నారు.

### యేసుక్రీస్తు బోధనలు ప్రేమ, శాంతి, త్యాగం మరియు సేవా భావాన్ని మనకు గుర్తుచేస్తాయన్న మంత్రి : కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** "క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని క్రైస్తవ సోదర సోదరీమణులకు, తెలంగాణ ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. యేసుక్రీస్తు బోధనలు ప్రేమ, శాంతి, త్యాగం మరియు సేవా భావాన్ని మనకు గుర్తుచేస్తాయి. క్రిస్మస్ పండుగ సమాజంలో మానవత్వం మరియు పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ పవిత్ర పర్వదినాన ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని కోరుకుంటూ..క్రిస్టియన్ సోదర, సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు."తెలిపారు.

## షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ కోసం వినూత్న నిరసన





**షాద్‌నగర్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా వద్ద ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక వాసి రాము వినూత్న రీతిలో ఫ్లాప్ కార్డులతో నిరసన చేపట్టారు. "మా ప్రాణాలను కాపాడండి మహాప్రభూడ ఇంకెంత మంది ప్రాణాలు పోతే విస్తీర్ణం చేస్తారు..?" అంటూ ఆయన గళమెత్తారు.రోజూ లక్షల సంఖ్యలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ చౌరస్తా ప్రమాదాలకు అడ్డాగా మారింది. ఇప్పటివరకు పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుని అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. గతంలో తండ్రికూతురు మృతి చెందిన ఘటన ప్రజలను కలిచివేసింది.రాము మాట్లాడుతూ మున్సిపల్ అధికారులకు ఐదు సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని, ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా కోర్టు వివాదాలు ఉన్నాయంటూ తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు స్పందించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.చౌరస్తా వద్ద రోడ్డు విస్తీర్ణం, స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్, డివైడర్లు సరైన రీతిలో ఏర్పాటు చేయకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు తీసుకొని చౌరస్తా విస్తరణ చేపట్టి ప్రజల రవాణా భద్రతను కాపాడాలని షాద్‌నగర్ ప్రజలు గళమెత్తుతున్నారు.

## హైబీజ్ టీవీ ఉత్తమ పారిశ్రామికవేత్తల అవార్డుల ప్రదానోత్సవం



**హైదరాబాద్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైటెక్ సిటీ నోవోటల్ హోటల్‌లో హైబీజ్ టీవీ ఆధ్వర్యంలో బుధవారం ఉత్తమ పారిశ్రామికవేత్తల అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఇంటీరియర్ డిజైనర్ విభాగంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ది లోటస్ స్టూడియో అధినేత్రి పద్మజ సింగ్కు అవార్డు లభించింది.హైబీజ్ టీవీ అధినేత రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా పద్మజ సింగ్ ఈ అవార్డును స్వీకరించారు. గత 22 సంవత్సరాలుగా తమ సంస్థ అందిస్తున్న నాణ్యమైన సేవలను గుర్తించి ఈ గౌరవం లభించడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని ఆమె తెలిపారు.అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఆఫీస్‌లు, హాస్పిటల్స్, జువెల్లరీ షోరూంలు, ఫామ్ హౌస్‌లలో ప్రత్యేకంగా ఫర్నిచర్ విభాగంలో ది లోటస్ స్టూడియో సేవలు విస్తృతంగా అందిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో త్వరలోనే మరిన్ని బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.అవార్డు అందుకున్న సందర్భంగా రాజ్ సింగ్, గౌతమ్, మానస తదితరులు పద్మజ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

## అక్క తమ్ముడిని ఘనంగా సన్మానించిన పెద్దాపూర్ గౌడ సంఘం



**వెల్దండ, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వెల్దండ గ్రామ సర్పంచ్‌గా మట్ట యాదమ్మ, బొల్లంపల్లి గ్రామ సర్పంచ్‌గా ఆమె తమ్ముడు ప్రసాద్ విజయం సాధించడంతో, ఒకే కుటుంబంలో ఇద్దరు సర్పంచులు అవడం విశేషమైంది.ఈ సందర్భంగా పెద్దాపూర్ గౌడ సంఘం వారిని ఘనంగా శాలువాలతో సన్మానించింది. వెల్దండ మండల కేంద్రంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సర్పంచులు కావడం అరుదైన విషయం అని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పెద్దాపూర్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు కొమ్మగొని అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కొమ్మగొని శేఖర్ గౌడ్, కొమ్మగొని వెంకట్ గౌడ్, సెక్రటరీ మరియు డైరెక్టర్ కొమ్మగొని రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కౌటికె విఠల్‌కు 'ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు

**హైదరాబాద్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** జీవిత బీమా రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందిస్తూ, లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ప్రముఖ బీమా నిపుణుడు కౌటికె విఠల్కు ప్రతిష్టాత్మక 'ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. దేశంలోని ప్రముఖ వ్యాపార మీడియా వేదిక హైబిజ్ టీవీ నిర్వహించిన "బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్2025 (మూడో ఎడిషన్)" కార్యక్రమంలో ఈ గౌరవం అందించారు. హైటెక్ సిటీలోని నోవోటెల్ హోటల్ వేదికగా అవార్డు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది.మిస్ యూనివర్స్ తెలంగాణ కేష్వి చావుడా, ఏవీపీ చక్రవర్తి చేతుల మీదుగా కౌటికె విఠల్, కౌటికె ఆదిత్య ఈ అవార్డును స్వీకరించారు.ప్రస్తుతం ఎల్ఐసీ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా దేశవ్యాప్తంగా నంబర్1 చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్గా గుర్తింపు పొందిన కౌటికె విఠల్, బీమా రంగానికి కొత్త ప్రమాణాలు నెలకొల్పారు. కేవలం పాలసీల విక్రయానికే పరిమితం కాకుండా, కస్టమర్ల వయస్సు, ఆదాయం, కుటుంబ బాధ్యతలు, భవిష్యత్ లక్ష్యాలను సమగ్రంగా విశ్లేషించి సంపూర్ణ ఆర్థిక భద్రతా ప్రణాళికలు (హోలిస్టిక్ ఫైనాన్షియల్ ప్లానింగ్) రూపొందించడం ఆయన సేవల ప్రత్యేకత

ప్రతి కస్టమర్కు




-అవసరానికి తగిన రిస్క్ కవరేజ్
-దీర్ఘకాలిక ఆర్థిక భద్రత
- క్లెయిమ్స్ సమయంలో సంపూర్ణ మార్గనిర్దేశం
-నిరంతర సేవలు, పాలసీల పర్యవేక్షణ


అందిస్తూ, "బీమా అంటే నమ్మకం" అనే సిద్ధాంతాన్ని తన వృత్తి జీవితమంతా ఆచరణలో పెట్టారు.ఈ విధంగా లక్షలాది కుటుంబాలకు భవిష్యత్ భద్రత కల్పించడమే కాకుండా, వందలాది యువ బీమా సలహాదారులను తీర్చిదిద్దుతూ నైతిక విలువలు, ప్రొఫెషనలిజం, సేవాభావంతో కూడిన బలమైన బృందాన్ని నిర్మించారు. ఆయన నాయకత్వంలో రూపొందిన అనేక మంది అడ్వైజర్లు జాతీయ స్థాయిలో ఉన్నత విజయాలు సాధించడం విశేషం.ఈ సందర్భంగా కౌటికె విఠల్ మాట్లాడుతూ,"ఈ అవార్డు నా వ్యక్తిగత విజయానికి మించినది. నాపై విశ్వాసం ఉంచిన ప్రతి కస్టమర్, నా టీమ్ సభ్యులు, నా కుటుంబ సభ్యుల సహకారానికి ఇది ప్రతీక. జీవిత బీమా ద్వారా ప్రతి భారతీయ కుటుంబానికి సంపూర్ణ ఆర్థిక భద్రత అందించడమే నా నిరంతర లక్ష్యం" అని అన్నారు.జీవిత బీమా రంగంలో విశ్వసనీయత, దీర్ఘకాలిక విలువలు, ప్రొఫెషనల్ సేవలతో కూడిన వ్యాపార నమూనాను విజయవంతంగా నిలబెట్టిన కౌటికె విఠల్కు లభించిన ఈ 'ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు, ఆయన సేవలకు లభించిన జాతీయ స్థాయి గుర్తింపుగా నిలిచింది.

# కడ్తాల్ మహాపిరమిడ్ లో ఘనంగా ప్రతీజీ ధ్యాన మహాయాగం






-భారీగా పాల్గొన్న ద్యానులు






**కడ్తాల్, డిసెంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పత్రీజీ ధ్యాన మహాయాగంలో బ్రహ్మర్షి పత్రీజీ వీడియా ఆధ్యాత్మిక సందేశాలు ధ్యానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ధ్యాన వేడుకలు బుధవారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ వేడుకల్లో ధర్మదేవత అనే అంశంపై సందేశం విన్పించారు. ఈ సృష్టి మొత్తం ధర్మదేవతతో నడిపించబడుతుందని తెలిపారు. ధర్మాన్ని తెలుసుకున్న వారంత ధర్మదేవతగా తయారువుతారన్నారు. ఆధర్మాన్ని కొంత వరకు సహించడం కూడా ఒక ధర్మమని తెలిపారు. ధర్మదేవత కొంత వరకు ఆధర్మాన్ని సహిస్తుందని, అయితే మితిమీరితే శిక్షిస్తుందని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ ధర్మంగా జీవించాలని కోరారు. అలాగే ప్రయోగం అనే అంశం గురించి వివరించారు. ఏది కూడా గుడ్డిగా నమ్మకూడదని ప్రయోగం చేసి నమ్మాలని సూచించారు. ప్రయోగం,అనుభవం , వ్యక్త పరిచడం అనే మూడు ద్వారా మనం పురోగతి చెందుతామని, వికాసం చెందుతామని తెలిపారు.

**మనం దేనిపైన అయితే దృష్టి పెడుతామో ఆదే లభిస్తుంది.. శ్రేయన్ దాగా**
ధ్యానంలో మనుసు ఎప్పుడైతే శూన్యమవుతుందో మనని మనం తెలుసుకోగల్గుతామన్నారు. బెంగళూరు పిరమిడ్ వ్యాలీ ఇంటర్నేషనల్ నిర్వాహకులు శ్రేయన్స్ దాగా. ప్రీతీజీ ధ్యాన మహాయాగంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడిన ఆయన మనం అనవసరమైన వాటిపైన దృష్టి పెడుతూ మన ఎనర్జీని కోల్పోతున్నామని తెలిపారు. మనం దేనిపైన అయితే దృష్టి పెడుతామో ఆదే జరుగుతుందని వివరించారు. కష్టాలు, సవాళ్లు వస్తే ఆందోళన చెందకుండా పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. మనం ఏదైన ఇతరుల నుంచి ఆశించి ఆది లభించకపోతే మనలో వ్యతిరేక ఆలోచనలు పెరుగుతాయని అందుకే ఎవరి నుంచి కూడా ఏది ఆశించకూడదని స్పష్టం చేశారు.

**సంగీతా కళాకారుడు సంజయ్ సింగికి సన్మాన కార్యక్రమం..**
తన సంగీత నాధ్య ధ్యానంతో ధ్యానులను విశేషంగా అలరిస్తున్న సంగీతకళాకారుడు సంజయ్ సింగి బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ఫౌండర్ బుద్ద సీఈవో క్వాంటమ్ ఫౌండేషన్ పి.చంద్రశేఖర్, మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

**పీఎంసీ క్యాలెండర్, ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ..**
పత్రీజీ ధ్యాన మహాయాగంలో పీఎంసీ న్యూఇయర్ క్యాలెండర్ ను మాస్టర్ శ్రేయన్స్ దాగా చేతుల మీదుగా ఆవిష్కరించారు. 8 సంవత్సరాల పీఎంసీ చరిత్రపై రూపొందించిన పీఎంసీ సావనీర్ ను ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. ధ్యానమాతృత్వం పుస్తకం సంగీతకళాకారుడు సంజయ్ కింగి ఆవిష్కరించగా, పత్రీజీ ధ్యానమృతం పుస్తకాన్ని విజయభాస్కర్ రెడ్డి విడుదల చేసారు. బాలవికాస్ సాంగ్ ను ఆవిష్కరించారు.

# మక్త మాదారం బీజేపీ నాయకులు చేయూత



**కడ్తాల్, డిసెంబర్ 24 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
మాజీ బీసీ కమిషన్ మెంబెర్ తల్లోజు ఆచారి పిలుపు మేరకు ఆర్థిక సహాయం అందించిన మక్త మాదారం బీజేపీ నాయకులుకడ్తాల్ మండల మక్త మాదారం గ్రామానికి చెందిన అమంచ రమేష్ ఇటీవల అనారోగ్యం తో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి మక్తమాదారం బీజేపీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయంగా అందించారు.

# ఆసుపత్రి భవనం పూర్తి చేయాలని డీఈ ఆదేశాలు



**ఆమనగల్ల, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలని టీజీఎంఎస్ఐడీసీ డీఈ కోటయ్య ఆదేశించారు. బుధవారం ఆయన ఆసుపత్రి భవనాన్ని సందర్శించారు. ఫిబ్రవరి నెల చివరి నాటికి భవనం పూర్తి కావాలని, కాంట్రాక్టర్ కు గడువు ఉందని అంతలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిఇ సూచించారు.

## ఉజ్వల యోజన పథకం ద్వారా మహిళలకు ఉచిత ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు



**మనోహరాబాద్, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మనోహరాబాద్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన కుటుంబాల మహిళలకు ఉచిత ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేయబడ్డాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదరిక రేఖకు దిగువన ఉన్న కుటుంబాల మహిళలకు శుభ్రత, ఆరోగ్యం, సౌకర్యం కలిగించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఉజ్వల యోజన పథకం అమలు చేస్తున్నదని, వంటగదిలో పొగరహిత వాతావరణం ఏర్పడి మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్, ఉప సర్పంచ్ టేక్మాల్ వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు బండి భూపాల్, సంద శ్రీశైలం, బిజెపి నాయకులు అజయ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు. మహిళలు ఉత్సాహంగా హాజరై గ్యాస్ కనెక్షన్లు స్వీకరించారు.

# ఘనంగా ప్రారంభమైన సాఫ్టాల్ క్రీడలు



**మనోహరాబాద్, డిసెంబర్24(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని స్థానిక క్రీడా ప్రాంగణంలో తెలంగాణ సాఫ్టాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పదోవ తెలంగాణ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్టాల్ ఛాంపియన్షిప్ (గర్ల్స్) పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తుంకుంట ఆంక్ష రెడ్డి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ప్రతిభను ప్రదర్శించాలని, ఆటల ఆడడం వలన పిల్లలు మానసికంగా, శారీరకంగా బలంగా తయారవుతారని పేర్కొన్నారు.కార్యక్రమంలో మనోహరాబాద్ గ్రామ సర్పంచ్ చీర్ల అనూష భాస్కర్ యాదవ్, రామాయిపల్లి గ్రామ సర్పంచ్ జక్కుల సత్యనారాయణ, లింగారెడ్డిపేట గ్రామ సర్పంచ్ పెంటా గౌడ్, కోనాయిపల్లి గ్రామ సర్పంచ్ మన్నే కల్యాణ్, నాయకులు నారాయణ, విఠల్ రెడ్డి, పురం రవి, నాగిరెడ్డి, సత్తిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు నిమ్మల యాదగిరి, కోనేరు సురేష్ కుమార్, సాఫ్టాల్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

# హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో నానో కన్వర్షన్స్ పుస్తక ఆవిష్కరణ




**హైదరాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ప్రభుత్వ సిటీ కళాశాల భౌతిక శాస్త్ర సహాచార్యుడు రతన్ కుమార్ రచించిన నానో కన్వర్షన్స్: ఎ సైంటిఫిక్ జర్నీ టు ఎతీయిజం పుస్తకాన్ని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. రియాజ్, బుక్ ఫెయిర్ ప్రెసిడెంట్ డా. యాకూబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైంటిఫిక్ దృక్పథాన్ని పెంపొందించే పుస్తకాలు సమాజ అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. రచయిత రతన్ కుమార్ (విశ్వగురు కలము) తన వ్యక్తిగత ప్రయాణాన్ని వివరించుతూ, మత విశ్వాసాలనుంచి నాస్తికత్వానికి మార్పు ఒకేసారి కాకుండా చిన్న చిన్న దశల్లో (నానో కన్వర్షన్స్) సైన్స్ ఆధారంగా ఎలా సాధ్యమైందో ఈ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. నిరూపించబడని విశ్వాసాల కన్నా సైన్స్ ఆధారంగా కొత్త జీవన విధానాన్ని రూపొందించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సుదర్శన్ రావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్రంథాలయ అధికారి డా. ఎస్. యాదగిరి, ప్రభుత్వ సిటీ కళాశాల గ్రంథపాలకుడు డా. రవికుమార్ చేగొని, రాష్ట్ర కేంద్ర గ్రంథపాలకురాలు శ్రీమతి రాణి, ప్రభుత్వ సిటీ కళాశాల ఆచార్యులు కోయి కోటేశ్వరరావు, హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ డా. ఆనందం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేటలో ఆర్డీవో యాదగిరికి బీజేపీ నేతల శుభాకాంక్షలు



**అచ్చంపేట, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో యాదగిరిని పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బీజేపీ నేతలు కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూములపై జరుగుతున్న అక్రమ కబ్జాలను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంగ నాయక్, మండికారి బాలరాజు, రామచంద్రయ్య, శ్రీనివాస్ గౌడ్, స్వచ్ఛంద్ర వెంకటేష్, చందులాల్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన ఉపసర్పంచ్ బట్టు చంద్రశేఖర్



**గంగాధర, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కాసారం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ బట్టు చంద్రశేఖర్ బీజేపీలో చేరారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించబడ్డారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వయంగా ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికతో గ్రామస్థాయి నాయకత్వం బీజేపీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# కరవకుండా..... నియంత్రించలేరా?





## వీధి కుక్కల పెరుగుదల పాలన వైఫల్యానికి ప్రతిబింబం

వీధి కుక్కల సమస్య ఇప్పుడు సాధారణ అసౌకర్యం కాదు.. ఇది ప్రజల ప్రాణభద్రతను సవాల్ చేస్తున్న అత్యంత తీవ్రమైన సామాజిక సమస్యగా మారింది. ముఖ్యంగా చిన్నారులు కుక్కల దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం సమాజాన్ని కలచివేస్తోంది. అయినా పాలన యంత్రాంగంలో కావాల్సిన చలనం కనిపించడం లేదు. గణాంకాలు చెప్పడం, నివేదికలు సిద్ధం చేయడం కాదు... ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అన్నదే అసలు ప్రశ్న. ఈ పరిస్థితిని గమనించిన హైకోర్టు వీధి కుక్కల నియంత్రణపై తక్షణ చర్యలు చేపట్టేలా ప్రత్యేక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం గమనార్హం. న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన స్థాయికి పరిస్థితి వెళ్లిందంటే.... సమస్య తీవ్రత ఎంతటిదో అర్థమవుతుంది.
రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒకచోట కుక్క కాటుకు గురవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరు స్వల్ప గాయాలతో బయటపడుతుంటే, మరికొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రాణనష్టాలూ సంభవిస్తున్నాయి. వీధిలో నడవాలంటే భయం, పిల్లలను బయటకు పంపాలంటే ఆందోళన ఇదే నేటి పరిస్థితి.

**బాధ్యత ఎవరిది?**
వీధి కుక్కల నియంత్రణ బాధ్యత గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలదే. కానీ చట్టాలు సహకరించడం లేదన్న కారణంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. వాస్తవానికి చట్టాలు అడ్డుకావడం కాదు..వాటిని అమలు చేయడంలోనే నిర్లక్ష్యం కనిపిస్తోంది. వీధి కుక్కలను పట్టుకుని కుటుంబ నియంత్రణ (ఎనిమల్ బర్త్ కంట్రోల్) చికిత్సలు చేయించడం, ప్రమాదకరంగా మారిన వాటిని వేరుచేయడం వంటి చర్యలు క్రమం తప్పకుండా జరిగితే సమస్య ఈ స్థాయికి చేరేది కాదు.

**ఏబీసీ కేంద్రాల లోపమే ముప్పు**
ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాలు జిల్లా కేంద్రాలకే పరిమితమై ఉండటం పెద్ద లోపం. అన్ని పురపాలికలు, మండల కేంద్రాల్లో ఇవి ఏర్పాటు కాకపోవడంతో కుటుంబ నియంత్రణ చికిత్సలు పరిమితమవుతున్నాయి. ఫలితంగా కుక్కల సంఖ్య నియంత్రణ తప్పుతోంది.
ఏబీసీ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, నిధుల కేటాయింపుపై ప్రభుత్వం తక్షణమే ద ృష్టి సారించాలి. ఇది ఖర్చు కాదు ప్రజల ప్రాణభద్రతకు పెట్టే పెట్టుబడి.

**మానవత్వం-భద్రత రెండూ అవసరం**
వీధి కుక్కల నియంత్రణ అంటే హింస కాదు. మానవత్వంతో, శాస్త్రీయ పద్ధతుల్లో సమస్యను ఎదుర్కోవచ్చు. కానీ చర్యలు ఆలస్యమైతే, నిర్లక్ష్యం కొనసాగితే, బాధితుల సంఖ్య పెరగడం ఖాయం. ప్రజల ప్రాణాలే ప్రధానమని ప్రభుత్వం, స్థానిక సంస్థలు గుర్తించాలి. హైకోర్టు ఆదేశాలను కాగితాలకే పరిమితం చేయకుండా కార్యాచరణగా మార్చాల్సిన అవసరం ఉంది.

**కరవకుండా నియంత్రించలేమా?**
మార్గాలు ఉన్నాయి... చట్టాలు ఉన్నాయి... విధానాలూ ఉన్నాయి. లోపం ఒక్కటేఅమలులో నిర్లక్ష్యం. అది తొలగినప్పుడే వీధులు భయంలేని దారులవుతాయి.

**వ్యాసకర్త**
అన్వర్ బేగ్



# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తతే ఆయుధం





**కురవి, డిసెంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" కార్యక్రమం భాగంగా సైబర్ నేరాలపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ డీఎస్పీ ఎన్. తిరుపతిరావు మాట్లాడుతూ టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారానే వాటిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పరిచయాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. లోన్ యాప్స్, బెట్టింగ్ యాప్స్ వాడటం వల్ల వ్యక్తిగత సమాచారం సైబర్ నేరస్తుల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పోలీస్ లేదా సీబీఐ అధికారులమని చెప్పుకుంటూ వీడియో కాల్స్ చేసి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని, అలాంటి కాల్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్ఐ గండ్రాతి సతీష్, సైబర్ క్రైమ్ ఎస్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

# కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సర్పంచుల సన్మానం

**కరీంనగర్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచులను ఘనంగా సన్మానించేందుకు ఈనెల 27న ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రకటించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌తో పాటు పార్లమెంటరీ స్థాయి, శాసనమండలి, శాసనసభ స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. లోక్‌సభ పరిధిలోని కార్పొరేషన్ చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు

# ఖలీల్‌వాడిలో కళ్యాణ లక్ష్మి

## - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**నిజామాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడి రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అతిథులుగా హాజరయ్యారు. మొత్తం 668 మంది లబ్ధిదారులకు రూ.6,68,77,488 విలువైన చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యం. ప్రస్తుతం లక్ష రూపాయల సహాయం అందుతోంది. తులం బంగారం ఇవ్వడం సాధ్యం కాకపోయినా కనీసం ఆర్థిక సహాయం పెంచాలని కోరుతున్నాను అని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేదల సంక్షేమానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మి నారాయణ, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, ఆర్డీవో రాజేందర్, నార్త్ ఎమ్మార్వో విజయ్‌కాంత్, సౌత్ ఎమ్మార్వో శ్రీధర్, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ విగ్రహాల పార్క్, వినాయక్ నగర్, హనుమాన్ జంక్షన్‌లో సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే గారు మహిళలకు విద్యా హక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి. అవమానాలు ఎదురైనా, రాళ్లు పడ్డా ఆమె చేతిలోని పుస్తకం మాత్రం కింద పడలేదు. ఆ పుస్తకమే లక్షలాది ఆడపిల్లల భవిష్యత్తు. ఆమె త్యాగమే మన కుమార్తెలు చదువుకోవడానికి, ధైర్యంగా మాట్లాడడానికి మూలం అని పేర్కొన్నారు. మహిళల సమానత్వం, విద్యతో ఎదుగుదల సాధించాలనే సావిత్రిబాయి పూలే గారి మార్గంలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. అదనంగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ, బీసీ వర్గాల హక్కుల పరిరక్షణకు బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూడా చైర్మన్ కేశ వేణు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరాల సుధాకర్, నరాల రత్నకర్, ఊర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనంత్ రాజారెడ్డి, ఆకుల లలిత, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మధురానగర్ గ్రామ అభివృద్ధి పనుల ప్రారంభం



**గంగాధర, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ గ్రామంలోని 9వ వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ వేముల భాస్కర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో మధురానగర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రమాణస్వీకారం చేసిన మూడు రోజుల్లోనే అభివృద్ధి పనులు ప్రారంభించడం పట్ల గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


# ఖలీల్‌వాడిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



**నిజామాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడి న్యూ అంబేద్కర్ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సేవ భావానికి ప్రతీక. యేసుక్రీస్తు బోధించిన మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి. సమాజంలో అన్ని మతాల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలి అని ఆకాంక్షించారు. అన్ని మతాలను సమానంగా గౌరవించడం సమాజానికి బలం చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో బీజేపీ నాయకులు, క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు, విశాల సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జమ్మికుంటలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్



**జమ్మికుంట, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్మికుంటలో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో యువజన, క్రీడల శాఖ రూ.6.5 కోట్ల నిధులకు పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల 4-లేన్ ట్రాక్‌ను ఖేలో ఇండియా పథకం కింద నిర్మించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల్లో ఆమోదం తెలపాల్సి , మూడు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఈ ట్రాక్ నిర్మాణంతో ఉత్తర తెలంగాణ యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ సౌకర్యాలు లభించనున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు జమ్మికుంట వేదిక కానుంది. కేంద్రం అనుమతిపై బండి సంజయ్ సంతోషం వ్యక్తం చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేసి భవిష్యత్ ఒలింపియన్లను తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు.

# హఫీజ్‌పేట్ సాయినగర్‌లో అంగన్వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మించాలని డిమాండ్



**కైతాపురం, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా సిడిపిఓ జ్యోతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సాయినగర్ బస్తీలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ప్రహరీ గోడతో కూడిన నూతన భవనం నిర్మించాలని వారు కోరారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రం కిర్బీ షీట్లతో ఏర్పాటు చేసిన గదిలో విద్యుత్, వాష్‌రూమ్ వంటి కనీస వసతులు లేక చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రం ముందు మస్కా కుంట చెరువు ఉండటం, ప్రహరీ గోడ లేకపోవడం ప్రమాదకరమని పేర్కొన్నారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం తక్షణమే నూతన భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ మాజీ అధికార ప్రతినిధి అజిత్ సేనాపతి, బీజేపీ జిల్లా గీతా సెల్ కన్వీనర్ రవి గౌడ్, హఫీజ్‌పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్, బీజేపీ నాయకులు కార్తీక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ బుడిగ జంగం కాలనీలో స్మశాన వాటిక ఏర్పాటుకు వినతి



**హుజురాబాద్, డిసెంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోటం రామ్‌కుమార్ ఆధ్వర్యంలో హుజురాబాద్ ఆర్డీవో రమేష్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. బుడిగ జంగం కాలనీలో గత 30 సంవత్సరాలుగా నివాసం ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మరణించిన వారిని కుల ఆచారం ప్రకారం సమాధి చేయడానికి ప్రత్యేక స్థలం లేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అందువల్ల కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిని స్మశాన వాటిక కోసం కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూర్పాటి శ్యామ్, తూర్పాటి రాజు, గంధం సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# విమాన రంగానికి కొత్త రెక్కలు



భారతదేశ విమానయాన రంగం మరో కీలక మలుపు తిరిగింది. మూడు కొత్త విమాన సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నో-ఆబ్జెక్షన్ సర్టిఫికెట్లు జారీ చేయడం ద్వారా, రంగంలో పోటీకి తాజా ఊపిరి పోసింది. షంఖ్ ఎయిర్, అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్ప్రెస్ సంస్థలు త్వరలో ఆకాశమార్గంలో ప్రయాణికులకు సేవలందించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇది కేవలం పరిశ్రమ విస్తరణకే కాదు ప్రయాణికులకు, స్థానిక ఆర్థిక వ్యవస్థలకు కూడా శుభవార్త. ఇటీవలి కాలంలో కొన్ని ప్రధాన విమాన సంస్థలు ఎదుర్కొన్న సాంకేతిక, నిర్వహణ సమస్యలు విమానయాన రంగంలోని లోపాలను బయటపెట్టాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యకరమైన పోటీ అవసరం ఎంతగానో ఉందని ప్రభుత్వం గుర్తించింది. అదే ఫలితంగా కొత్త సంస్థలకు మార్గం సుగమం చేసింది. పోటీ పెరిగితే సేవల నాణ్యత మెరుగవుతుంది, ధరలు సమతుల్యంగా ఉంటాయి అన్నది ఆర్థిక సూత్రం. ఇప్పుడు అదే సిద్ధాంతం విమాన రంగంలో అమలుకావడానికి అవకాశముంది. కొత్త విమాన సంస్థల ప్రవేశంతో ప్రయాణికులకు ఎంపికలు పెరుగుతాయి. సమయపాలన, భద్రత, ప్రయాణ సౌకర్యాల విషయంలో సంస్థలు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సి వస్తుంది. ముఖ్యంగా ప్రాంతీయ విమాన సేవలు విస్తరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చిన్న పట్టణాలు, వెనుకబడిన ప్రాంతాలు విమాన నెట్వర్క్‌తో అనుసంధానమైతే, వ్యాపారం, పర్యాటకం, పరిశ్రమలకు కొత్త దారులు తెరుచుకుంటాయి. షంఖ్ ఎయిర్ వంటి దేశీయ సంస్థల ప్రారంభం ఉపాధి రంగానికి కూడా ఊతమిస్తుంది. పైలట్లు, సాంకేతిక నిపుణులు, గ్రౌండ్ స్టాఫ్, నిర్వహణ సిబ్బంది వరకు వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి. “విమాన ప్రయాణం కొద్దిమందికే కాదు . ప్రతి ఒక్కరికీ” అనే లక్ష్యాన్ని దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోంది. మొత్తంగా చూస్తే, భారతదేశ విమాన రంగానికి ఇది ఒక సువర్ణావకాశం. పోటీ పెరిగితే సేవలు మెరుగుపడతాయి, ధరలు నియంత్రణలో ఉంటాయి. ప్రయాణికుడే కేంద్రంగా విధానాలు రూపుదిద్దుకుంటాయి. ఆకాశమే హద్దుగా సాగుతున్న భారత విమానయాన రంగం. ఈ కొత్త రెక్కలతో మరింత ఎత్తుకు ఎగరడం ఖాయం.

**శ్రీ రాం నిడిగొండ**
**చీఫ్ ఎడిటర్**
**నీలగిరి ఎక్స్ ప్రెస్**
**వ్యవస్థాపక అధ్యక్షులు**
**- తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్**

